Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి సెల్ : 9440815774

Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 219 | Monday : 05.08.2025 | Price : 3/- | Pages : 4

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :219 | మంగళవారం 5 ఆగస్టు 2025 | వెల : 3 | పేజీలు : 4



## తొలి మధ్యవర్తి శ్రీకృష్ణ భగవానుడే..

- మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను సెటిల్ చేసుకోండి: సుప్రీంకోర్టు
- సమస్య పరిష్కారం కోసం ఓ కమిటీని ప్రతిపాదిస్తున్నాం
- ఆ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి ఆలయ ట్రస్టు బోర్డుకు మధ్యవర్తిత్వం వహిస్తుంది



## తీవ్ర చిక్కుల్లో అనిల్ అంబానీ

- బ్యాంక్‌లకు ఈడీ నోటీసులు
- మనీలాండరింగ్ కేసులో దర్యాప్తు చేపట్టిన ఈడీ
- మొత్తం 12-13 బ్యాంకులకు దర్యాప్తు సంస్థ నుంచి నోటీసులు
- వీటిల్లో పబ్లిక్ సెక్టార్‌తోపాటు ప్రైవేటు సెక్టార్ బ్యాంకులు




## ఐదేళ్లలో రూ.7.08లక్షల కోట్ల జీఎస్టీ ఎగవేత..

- లోక్‌సభలో గణాంకాలను వెల్లడించిన మంత్రి..!
- దాదాపు రూ.1.79లక్షల కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ మోసాలు
- 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే రూ.2.23 లక్షలకోట్లకుపైగా జీఎస్టీ ఎగవేత

# 15 నుంచి ఆన్ లైన్లో 700 ప్రభుత్వ సేవలు

- నాణ్యమైన జీవన ప్రమాణాల లక్ష్యంగా ప్రణాళికలు
- రాష్ట్ర స్థూల ఉత్పత్తిపై ప్రణాళికా శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- తలసరి ఆదాయం పెంచడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలి
- 2025-26 ఆర్థిక సంవత్సరంలో తలసరి ఆదాయం రూ. 3,47,871 సాధించాలి
- దానికి అనుగుణంగా 2029 నాటికి రూ. 5.42 లక్షలు తలసరి ఆదాయం వచ్చేలా లక్ష్యంగా పెట్టుకోవాలి



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

విజన్, పీపుల్, నేచర్, టెక్నాలజీలకు ప్రాధాన్యత ఇచ్చి పాలన చేస్తే అత్యుత్తమ ఫలితాలు వస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. నాణ్యమైన జీవన ప్రమాణాలను సాధించే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని సీఎం సూచించారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి, కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ పై ప్రణాళికా శాఖతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సచివాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. తలసరి ఆదాయం పెంచడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలని సీఎం అన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో తలసరి ఆదాయం రూ. 3,47,871 సాధించాలని, దానికి అనుగుణంగా 2029 నాటికి రూ. 5.42 లక్షలు తలసరి ఆదాయం వచ్చేలా లక్ష్యంగా పెట్టుకోవాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "ప్రభుత్వ శాఖలు ఆయా రంగాల్లో ముందస్తు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలి. స్వల్ప, మధ్య, దీర్ఘ కాలిక లక్ష్యాలకు అనుగుణంగా విజన్ తో పనిచేయాలి. ప్రపంచం పోకడలను గమనిస్తూ అవకాశాలను అందుకోవాలి. ప్రజలను, సమాజాన్ని, - మిగతా3లో



## ఏపీలో ఉచిత బస్సు ప్రయాణంపై మార్గదర్శకాలు జారీ

- ఆగష్టు 15 వ తేదీ నుంచి రాష్ట్ర మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు
- కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటి ప్రజలకు చేరువ
- జనవరి నెలలో కర్నాటక, తమిళనాడు, తెలంగాణలో పర్యటించి అక్కడ అమలు జరుగుతున్న ఫ్రీ బస్సు పథకాన్ని పరిశీలించినట్లు మంత్రి రాంప్రసాద్ రెడ్డి ప్రకటన



## మందు బాబులకు గుడ్ న్యూస్

- కొత్త మద్యం విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం
- కొత్త మద్యం విధానాన్ని సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అమలు
- ఆల్కాహాల్ కంటెంట్ తక్కువ ఉండే మద్యం విక్రయాలతో నష్టం తగ్గించవచ్చు

## 'లోకేశ్‌కు సీఎం పదవి.. చంద్రబాబు ఇంట్లో గొడవలు'

- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి లక్ష్మీపార్వతి
- భయంకరమైన కుట్రలకు చంద్రబాబు ఆద్యుడు
- చంద్రబాబు మోసాలను సింగపూర్ ప్రభుత్వం గ్రహించింది
- ముఖ్యమంత్రి పదవి కోసం లోకేశ్ ఇంట్లో గొడవలు పెడుతున్నాడు. కుటుంబ కలహాలు పెరిగాయి.
- లోకేశ్‌ను అందుకే చంద్రబాబు పొగుడుతున్నారు.



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, తాడేపల్లి**

ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌పై వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి లక్ష్మీపార్వతి సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్య మంత్రి పదవి కోసం లోకేశ్ ఇంట్లో గొడవ చేస్తున్నారని అన్నారు. ఇదే సమయంలో తండ్రిని మించిన అవినీతిలో లోకేశ్ మునిగి పోయారని విమర్శలు చేశారు. భయంకరమైన కుట్రలకు చంద్రబాబు ఆద్యుడు అని చెప్పుకొచ్చారు. చంద్రబాబు మోసాలను సింగపూర్ ప్రభుత్వం గ్రహించింది అంటూ కామెంట్స్ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి లక్ష్మీపార్వతి తాజాగా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పదవి కోసం లోకేశ్ ఇంట్లో గొడవలు పెడుతున్నాడు. కుటుంబ కలహాలు పెరిగాయి. లోకేశ్‌ను అందుకే చంద్రబాబు పొగుడుతున్నారు. సరిగ్గా చదువుకోని లోకేశ్‌ను మంత్రిని చేశారు. - మిగతా3లో

# జూబ్లీహిల్స్ కోసం గులాబీ వ్యూహాలు




- జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్ఎస్‌కు సిట్టింగ్ సీటు కావడంతో ప్రతిష్టాత్మకంగా మారింది
- ఎన్నికలు ఎప్పుడొచ్చినా గెలిచేందుకు గులాబీ పార్టీ తన వ్యూహాలకు పదును పెట్టాల్సి ఉంటుంది.
- గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలో గణనీయంగా సీట్లు గెలవడంతో గులాబీ పార్టీకి రాబోయే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక గెలవడం అనివార్యంగా మారినట్లుంది.

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్**

త్వరలో ఉప ఎన్నిక జరిగే జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్ఎస్‌కు సిట్టింగ్ సీటు కావడంతో ప్రతిష్టాత్మకంగా మారింది. ఎన్నికలు ఎప్పుడొచ్చినా గెలిచేందుకు గులాబీ పార్టీ తన వ్యూహాలకు పదును పెట్టాల్సి ఉంటుంది. ఇక్కడి నుంచి 2018, 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ తరుఫున దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ విజయం సాధించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలో గణనీయంగా సీట్లు గెలవడంతో గులాబీ పార్టీకి రాబోయే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక గెలవడం అనివార్యంగా మారినట్లుంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉన్న ఆరు డివిజన్లు ఉన్నాయి. వాటిలో రహ్మత్ నగర్, వెంగళరావు నగర్, షేక్‌పేట, బోరబండ, యూసుఫ్ గూడ, ఎర్రగడ్డలున్నాయి. నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో ముస్లిం మైనార్టీ ఓటర్లున్నారు. వారే విజయావకా శాలను ప్రభావితం చేస్తారని గత ఎన్నికల్లో ఓటింగ్ సరళిని పరిశీలిస్తే తెలుస్తోంది. దాదాపుగా 32 శాతానికి పైగా వారు న్నారు. 2014 ఎన్నికల్లో ఎంఐఎం తరుపున పోటీ చేసిన నవీన్ యాదవ్ 41,656 ఓట్లు సాధించారు. దాదాపుగా 25.19శాతం ఓట్ల ను పొంది రెండో స్థానంలో నిలిచారు.ఎంఐఎం పార్టీ 2009 అసెంబ్లీ ఎన్నికల్లో 23.96 శాతం, 2014 పార్లమెంట్ ఎన్నికల్లో సైతం 19.6 శాతం ఓట్లను పొందింది. - మిగతా3లో

## రాష్ట్రపతితో గంటల వ్యవధిలో మోదీ, అమిత్ భేటీలు.. అందుకేనా?



- ఈ వరుస భేటీలపై ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడకపోయినప్పటికీ.. పలు ఊహాగానాలు
- జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదా పునరుద్ధరణ కోసమేనంటూ సోషల్‌మీడియాలో ప్రచారం
- ఆర్టికల్ 370ని రద్దుచేసి ఆరేళ్లు పూర్తవుతున్న తరుణంలో జరిగిన భేటీలతో ఈ తరహా చర్చ

## సింగపూర్‌లో జగన్ ప్రభుత్వం ఏపీ ప్రతిష్ఠను దెబ్బ తీసింది

- మున్సిపాల్టీల్లో వ్యర్థాల నిర్వహణకు అధిక ప్రాధాన్యం
- స్వచ్ఛాంధ్ర కోసం సీఎం చంద్రబాబు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు
- డిసెంబర్ నాటికి లెగసీ వేస్ట్ ఫ్రీ స్టేట్ గా ఏపీని మారుస్తాం
- మీడియా సమావేశంలో పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ



### ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

## తల్లిపాలతోని బిడ్డకు ఆరోగ్యం




**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 4:**
శ్రీకాళహస్తి రూరల్ మండలం ముద్దుమూడి అంగన్వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రగతి స్వచ్ఛంద సంస్థ విజయ వాహిని చారిటబుల్ ట్రస్ట్ వైద్య ఆరోగ్యశాఖ సంయుక్తంగా తల్లిపాల వారోత్సవాలు గర్భిణీ స్త్రీలకు బాలింతలకు అవగాహన కల్పించుటకు ఈ కార్యక్రమం నిర్వహించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్వైజర్ మంజుల మాట్లాడుతూ ప్రభుత్వము గర్భిణీ స్త్రీలకు బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నదని క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాల్లో తీసుకుని బిడ్డలను సంరక్షించుకోవాలని తెలిపారు ప్రగతి స్వచ్ఛంద సంస్థ శ్రీ కాళహస్తి మండల కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి గర్భిణీ స్త్రీ బాలింతలు అంగన వాడి కేంద్రాల్లో అందిస్తున్న సేవలు సక్రమంగా పౌష్టికాహారం వినియోగించు కుని గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి వద్దనే పెరటి తోటలు పెంచుకుని తక్కువ ఖర్చుతో ఆకుకూరలు కాయగూరలు పండ్లు తీసుకుని ఆరోగ్యం కాపాడుకొని బిడ్డలను ఎలాంటి అనారోగ్యం పాలు కాకుండా చూసుకోవాలని తెలిపారు. విజయ వాహిని చారిటబుల్ ట్రస్ట్ కోఆర్డినేటర్ లక్ష్మి మాట్లాడుతూ ప్రతినెలా ప్రతి బిడ్డ ఎత్తుకు తగ్గ బరువు వయసుకు తగ్గ బరువు పెరుగుతున్నారా లేదా అని అంగనవాడి కేంద్రాల్లో పరీక్షించుకోవాలని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ కార్యకర్త రాజేశ్వరి మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు తప్పక అంగన్వాడీ కేంద్రంలో గర్భం దాల్చిన వెంటనే పేరు నమోదు చేసుకోవాలని ఈ కార్యక్రమం తప్పక వేసుకోవాలని తెలిపారు. తల్లి బిడ్డల సంరక్షణపై ప్లే కార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ముద్దుమూడి దొడ్ల మిట్ట ముచ్చువోలు ఉడమలపాడు దొమ్మరపాలెం అంగన్వాడీ కేంద్రాల టీచర్లు కళావతి మాధవి రంగమ్మ సులోచన దేవి జ్యోత్స్న గర్భిణీ స్త్రీలు బాలింతలు పాల్గొన్నారు. తరువాత గ్రామంలో గర్భిణీ స్త్రీలు బాలింతలు ప్లే కార్డ్స్ బ్యానర్లు తల్లిపాల విశిష్టతను తెలిపే విధంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

## ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం




**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 04:**
సేవా ఆర్గనైజేషన్ అధ్యక్షుని కుమారుడైన యం.డిల్లీశ్వర్ రావు పుట్టిన రోజు సందర్భంగా చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద సేవా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు డాక్టర్ కే.రాజేష్ మరియు సభ్యులు శివ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా

## అర్జీ దారుల నుండి ఫిర్యాదులను స్వీకరిస్తున్న

### జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు04:**
చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా అర్జీ దారుల నుండి ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐఏఎస్. చిత్తూరు కలెక్టరేట్‌లో నూతన సమావేశపు మందిరం నందు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ను నిర్వహిస్తున్న జిల్లా యంత్రాంగం.అర్జీదారుల సమస్యలను ఆలకిస్తూ... సంబంధిత జిల్లా అధికారులకు అర్జీల పరిష్కారం నిమిత్తం తగు సూచనలు జారీ చేస్తూ.. రెవిన్యూ సమస్యలపై సంబంధిత తహసిల్దార్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మరియు ఫోన్ ద్వారా మాట్లాడుతూ. అర్జీదారుల సమస్య లపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్..జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పడాల్,డిఆర్ఓ కే మోహన్ కుమార్‌లు ప్రజల నుండి అర్జీలను స్వీకరిస్తున్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం కార్యక్రమానికి వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## శ్రీమల్లేశ్వర స్వామి ఆలయగోపురానికి భూమిపూజా





**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 04:**
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశీస్సులతో కుప్పం నియోజకవర్గంలోని గుడిపల్లి మండల పరిధిలోని మల్లప్ప కొండలో వెలిసిన శ్రీమల్లేశ్వర స్వామి ఆలయ గోపురానికి భూమి పూజా కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో మల్లప్ప కొండలో వెలసిన మల్లేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి రూ.3.80 కోట్లు విడుదల చేశారని ఆయన తెలియజేశారు.మల్లప్ప కొండను ఒక ఆధ్యాత్మిక మందిరంగా తీర్చిదిద్దడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. అని ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర శ్రీకాంత తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ, మండల స్థాయి టిడిపి నేతలు, కార్యకర్తలు భక్తాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే

# కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం





**రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్**

**నియోజకవర్గంలో త్వరలో పారిశ్రామిక వాడగా అభివృద్ధి చెందుతుంది**

**నియోజకవర్గంలో కార్వేటినగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అప్గ్రేడ్ చేయాలి..:**

**ప్రభుత్వ విప్ మరియు స్థానిక ఎమ్మెల్యే వి ఎం థామస్**

**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 04:**
రాష్ట్రంలో త్వరలో 100 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నిర్మించడానికి రూ. 194 కోట్లు నిధులు మంజూరు చేసి, ఆర్ అండ్‌బి ఆధ్వర్యంలో నిర్మాణం కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు.సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జీడి నెల్లూరు నియోజకవర్గం కార్వేటి నగరం మండలం పసలవాని మిట్ట ఆరిమేని గంగమ్మ దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ట మహా కుంభాభిషేకం,పాల్గొన్నారు, అనంతరం అలత్తూరు గ్రామపంచాయతీఈడిగపల్లి గ్రామం,విలేజ్ హెల్త్ క్లినిక్ 20.80లక్షలతో నిర్మించిన భవనాన్ని ప్రభుత్వ విప్ మరియు జిడి నెల్లూరు ఎం ఎల్ ఏ వి. ఎం థామస్ తో కలసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడు తూ గ్రామ స్థాయిలో ఇంటింటికి వైద్య సేవలు అందించడంలో భాగంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ 2017 సంవత్సరంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని, ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌లు విలేజ్ హెల్త్ క్లినిక్ లను ఏర్పాటు చేసి ప్రజలకు ఇంటి వద్దకే వైద్య సేవలు అందించే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి విలేజ్ హెల్త్ క్లినిక్ లో గల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్ఎంలు, ఆశాలు ఇంటింటి పరిశీలనకు వెళ్లి అనారోగ్యంతో బాధపడు తున్న వారిని మెడికల్ ఆఫీసర్ వద్దకు అవసరమైతే సిహెచ్ సి కి తీసుకెళ్లి వైద్యం అందించడం జరుగుతుందని తెలిపారు. విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహిం చడంతో పాటు 105 రకాల మందులను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో 18 సంవత్సరాల పై బడిన స్త్రీ, పురుషులకు ఎన్సీడీ 3.0 సర్వే ద్వారా హైపర్ టెన్షన్, డయాబెటిస్, గుండె జబ్బులు, క్యాన్సర్ ఇలాంటి జబ్బులను గుర్తించి ప్రాథమిక దశలోనే వైద్యం అందించి ప్రాణులు కాపాడే చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. స్టెమి కార్యక్రమం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో గుండె సమస్యలతో ఆసుపత్రికి చేరుకున్న వారికి రూ.45 వేల విలువ గల ఇంజక్షన్ ను ప్రభుత్వం ఉచితంగా అందించి ప్రాణాలను కాపాడడం జరుగు తున్నదని, ఇందులో భాగంగా గుండె సమస్యతో అత్యవసర పరిస్థితులో ఆసుపత్రికి చేరుకున్న 3,200 మందిలో 3,918 మంది ప్రాణాలనురక్షించగలిగామని తెలిపారు. రాష్ట్రానికి 10,032 విలేజ్ హెల్త్ క్లినిక్ లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసి అవసరమైన ఆర్థిక సహాయంను 14,15 ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రానికి కేటాయించగా, గత ప్రభుత్వం ఆ నిధులను దారి మళ్లించి, ఉపాధి హామీ పథకానికి కేటాయించిన నిధులతో కేవలం 3,000 విలేజ్ హెల్త్ క్లినికల్ మాత్రమే ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ థామస్ మాట్లాడుతూ గంగాధర్ నెల్లూరు నియోజకవర్గంని పరిశ్రమల కారిడార్గా ఏర్పాటు చేస్తాం ఇప్పటికే రెండు పరిశ్రమలు స్థలాన్ని పరిశీలించాయి అలాగే 108 సేవలను మరింత విస్తృతం చేయాలని మంత్రికి ఎమ్మెల్యే డాక్టర్ థామస్ తెలియజేశారు అలాగే వేలూరు సిఎంసి హాస్పిటల్‌లో చిత్తూరు జిల్లా ప్రజలకు 50 శాతం డిస్కౌంట్ ఇచ్చేలాగా అసెంబ్లీలో చర్చి స్తాం ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా వైద్య సదుపా యాలుకు మంత్రిచొరతో కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ సుధారాణి, కార్వేటి నగరం ఎంపీడీవో చంద్రమౌళి, పంచాయతీ కార్యదర్శి భవాని,సి హెచ్ ఓ ఆర్ రేష్మి, రాజేశ్వరి, గౌరీ, ప్రకృతి షెల్టర్ చైర్మన్ పాలసముద్రం టిడిపి నాయకుడు తాళ్లూరి శివ, టిడిపి యువ నాయకుడు విక్రమ్, యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ వెంకటేష్ యాదవ్ రాజశేఖర్ నాయుడు నియోజకవర్గం ఎస్సీ సెల్ కార్యదర్శి కుమార్, ఆర్టిఐ జిల్లా అధ్యక్షుడు జయరాజ్ సర్పంచ్ పుష్పాంజలి , గ్రీన్ అంబాసిడర్ ఇన్చార్జ్ ఏకాంబరం, మధు గల్లా, పాలసముద్రం టిడిపి నాయకులు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో కుంకి ఏనుగుల తొలి ఆపరేషన్ సక్సెస్

**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 04:**



పలమనేరులో కుంకి ఏనుగులు రంగంలోకి దిగాయి అన్నీ ఏనుగులు సురక్షితంగా ఉన్నయి అని డిఎఫ్ఓ తేలిపారు. దారి తప్పి పొలాల్లోకి ప్రవేశించి, పంటలను నాశనం చేస్తున్న అడవి ఏనుగులను నిరోధించే లక్ష్యంతో.... తీసుకొచ్చిన కుంకీ ఏనుగులు సత్ఫలితాలనిస్తున్నాయి. కర్ణాటక నుంచి తీసుకువచ్చి పలమనేరు సమీపంలో ఏర్పాటు చేసిన 'ఎలిఫెంట్? పార్క్' లో ఉన్న నాలుగు కుంకీ ఏనుగులతో చేపట్టిన తొలి ఆపరేషన్? విజయవంతమైంది. పలమనేరు నియోజకవర్గం టేకులమంద అటవీ ప్రాంతం నుంచి పొలాల్లోకి ప్రవేశిస్తున్న అడవి ఏనుగులను నిరోధించేందుకు కర్ణాటక నుంచి తెచ్చిన కృష్ణ, జయన్?, వినాయక్? అనే కుంకీ ఏనుగులను వినియోగించారు.

## ఘనంగా సింగిల్ విండో చైర్మన్ ప్రమాణ స్వీకారం



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 04:**
అన్నమయ్యజిల్లా పీలేరుసహకారసంఘం అభివృద్ధి, రైతుల ప్రయోజనాలు వాటి లక్ష్యాలను సాధించడానికి, నూతనంగా ఎన్నికైన చైర్మన్ డైరెక్టర్లు కృషి చేయాలని, తెలుగుదేశం పార్టీ జాతీయప్రధాన కార్య దర్శి పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. పీలేరు సింగిల్ విండోఅధ్యక్షులు యల్లెల రెడ్డెప్ప రెడ్డి, డైరెక్టర్‌లుగా గూడ రేవుపల్లి పుల్లయ్య, పీలేరు నుండి అమానుల్లా కల కడ అధ్యక్షులు మద్దిపట్ల వెంకటరమణ నాయుడు, డైరెక్టర్‌లుగా నడించర్ల నుండి బి.గిరిజమ్మ,కోన నుండి ఎం.వెంకట రమణను, ఎమ్మెల్యే సమక్షంలో సంబంధిత అధికారులుప్రమాణస్వీకారంచేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా వ్యవసాయరంగంలో అన్ని విధాల రైతులకు వ్యవసాయఉత్పాదకతను పెంచడానికి కావాల్సినసబ్సిడీయంత్రాలు, పరికరాలు, రుణాలు లాంటి ప్రభుత్వం రైతుల కోసం అమలుచేస్తున్న పలు పథకాలతో పాటు సహాయ సహకారాలు అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి కోటపల్లి బాబు రెడ్డి పోలిశెట్టి సురేంద్ర నల్లారి రియాజ్ పసుపులేటి లక్ష్మీకర్ ఏఎంసి డైరెక్టర్ కిషోర్ నాయుడు ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

# సొంతగూటికి కుమార్ రాజా

**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు 04:**



తెలుగుదేశంపార్టీ నుంచి వైసీపీలోకి ఈనెల 3న చేరిన కుమార్ రాజా మరల సొంత గూటికి చేరుకున్నారు మండలంలోని శెట్టి పేట పంచాయతీ తోటకూరపల్లికి చెందిన కుమార్ రాజు తొలి నుంచి తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్నారు. పలువురి ప్రలోభాలికి గురై అనివార్య కారణాల వల్ల వైసీపీలోకి చేరడం జరిగిందని అయితే సొంత తల్లికి మోసం చేయడం తగదని తెలుసు కొని మరల తెలుగుదేశం పార్టీలో చేరినట్లు కుమార్ రాజు తెలిపారు. తన తప్పు తెలిసి వచ్చిందని ఈ మేరకు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి సీనియర్ నాయకులు పురుషోత్తం రాజు లక్ష్మణ రాజు (పతి రాజు) మాదిరాజు ప్రదీప్ రాజు శ్రీధర్ రాజు (గిరిరాజు) శంకర్ రాజు తదితరుల ఆధ్వర్యంలో తెలుగుదేశం కండువా కప్పుకుని పార్టీలోకి చేరినట్లు ఆయన వివరించారు. ఇకపై తన జీవిత కాలం తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతానని కుమార్ రాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పవన్ కుమార్ అర్జున్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

## ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు 04:**
ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక కళాశాలలో విద్యార్థులకు త్రిబుల్ ఐటీ జేఈఈ వంటి పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ను విద్యార్థులకు అందించారు. పోటీ ప్రపంచంలో విద్యలో రాణించి ఆర్థికంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పరిమళ ఉపాధ్యాయులు అమర్నాథ్ రెడ్డి ఆనంద్ అధ్యాపకులు పాల్గొన్నారు.

## దళిత రైతు చిన్న రెడ్డప్ప భూ సమస్యను పరిష్కరించాలి



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 04:**
దళిత రైతు భూ సమస్యను రెవిన్యూ అధికారులు సత్వరమే పరిష్కరించాలని కోరుతూ మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు యమలా సుదర్శన్ ప్రసంగిస్తూ చౌడేపల్లి మండలం దిగువపల్లి పంచాయతీ అప్పినేపల్లికి చెందిన చిన్న రెడ్డప్పకు దిగువపల్లి రెవెన్యూ పైకి సర్వేనెంబర్ 322/5 నందు ఒక ఎకరా 36 సెంట్లు భూమి ని 1980లో బి కే టి పట్టాను ప్రభుత్వం మంజూరు చేసింది అన్నారు. ఆనాటి నుంచి భూమిని రైతు సాగు చేసుకుంటున్నాడని ఖాతా నెంబర్ 517తో పాసుపుస్తకం సైతం ఉందన్నారు. గత 25 సంవత్సరాల క్రితం ఎస్సీ కార్పొరేషన్‌ద్వారా 70 మామిడి చెట్లు సైతం పెట్టుకుని పలసాయాన్ని విక్రయించుకుంటూ రైతు జీవిస్తున్నాడన్నారు. అయితే కొంతకాలంగా మామిడిలోనూ నష్టాలు చూసిన దళిత రైతు చిన్న రెడ్డప్ప పొట్ట కూటికోసం కర్ణాటక రాష్ట్రానికి కూలీకని వెళ్లారన్నారు అయితే కొందరు, భూస్వాములు రైతు పొలం పై కన్నేసి ఆక్రమణ చేసుకున్నారని తెలుసుకున్న రైతు పొలంలోకి వెళ్లేందుకు ప్రవేశించగా అడ్డుకుంటున్నారని అన్నారు. రైతు చిన్న రెడ్డప్ప వ్యవసాయ పొలాన్ని దురాక్రమణ చేసుకొని కులం పేరుతో దూషించిన కంచెం గంగప్ప కంచం గంగమల పై చట్టపరమైన చర్యలు తీసుకొని భూ కబ్జా నుంచి రక్షించాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు మాల మహానాడు ఆధ్వర్యంలో తాసిల్దార్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు యమల చంద్రయ్య, గుండా మనోహర్, హరి సేకర చౌడేపల్లి మాల మహానాడు అధ్యక్షుడు కొత్తపల్లి మనీ, నియోజకవర్గ ఇన్చార్జ్ కృపామని, ఉపాధ్యక్షులు రెడ్డి, జనరల్ సెక్రెటరీ సురేష్, మనీ, గుట్ట రెడ్డి, రమణ,రాము, తదితరులు పాల్గొన్నారు.

### అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధురాలికి

## పింఛన్ అందజేసిన తెలుగు తమ్ముళ్లు

**కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు 4:**




కుప్పం మండలం వెండుగంపల్లి పంచాయతీ మునెమ్మ వికలాగురాలు కుప్పం ప్రభుత్వ హాస్పిటల్‌లో అనారోగ్యంతో చికిత్స తీసుకుంటున్న ఆమెకు పింఛన్ పంపిణీ చేసిన, సచివాలయ సిబ్బంది, కుప్పం మండల కో క్లస్టర్ ఇంచార్జి వెడి, చంద్రశేఖర్, నారాయస్వామి తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక



# 15 నుంచి ఆన్ లైన్లో 700 ప్రభుత్వ సేవలు

-మొదటిపేజీ తరువాయి

కుటుంబాలను, వ్యక్తులను దృష్టిలో పెట్టుకుని కార్యక్రమాలు అమలు చేయాలి. ఫ్యామిలీ ఒక యూనిట్ గా తీసుకుని పథకాలు, కార్యక్రమాలు రూపొందించాలి... కనీస అవసరాలు అందించాలి. పథకాలతో పాటు వారి ఆదాయాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలి. పర్యావరణానికి మేలు చేసే విధంగా ప్రభుత్వ విధానాలు, ప్రజల ఆలోచనలు ఉండాలి. సహజ వనరులను రక్షించుకుంటూ ప్రకృతిని కాపాడుకోవాలి. ఒక పరిశ్రమలో తయారైన వేస్ట్ మరో పరిశ్రమకు ముడి సరుకు అయ్యేలా చేసి సర్క్యులర్ ఎకానమీకి నాంది పలకాలి. సహజ వనరులను సమర్ధవంతంగా వినియోగించుకోవాలి. అత్యుత్తమ టెక్నాలజీని పాలనకు అనుసంధానించి మెరుగైన సేవలు అందించాలి. ఆరోగ్యం నుంచి వ్యవసాయం వరకు టెక్నాలజీని భాగస్వామి చెయ్యాలి. ప్రజల కోసం.. విజన్ రూపొందించుకుని పర్యావరణం దెబ్బతినకుండా చూసుకుంటూ టెక్నాలజీని అనుసంధానం చేస్తూ పాలన సాగిస్తే మంచి ఫలితాలు వస్తాయి. అందుకే పీపుల్, విజన్, నేచర్, టెక్నాలజీ అంశాలకు పాలనలో ప్రాధాన్యం ఇస్తూ సమన్వయంతో పనిచేస్తే అత్యుత్తమ ఫలితాలు వస్తాయని ఆ దిశగా అధికారులు, ఆయా శాఖలు పనిచేయాలి." అని సీఎం సూచించారు.

**ఉత్పత్తులకు విలువ జోడించే కీలకం**

"వివిధ రంగాల్లో రోజువారీగా మారే పరిణామాలకు.. మార్పులకు అనుగుణంగా కార్యక్రమాలు ఉండాలి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వస్తున్న మార్పుల మేరకు ప్రణాళికలు రూపొందించుకోవాలి. మన ఉత్పత్తులకు విలువ జోడింపు అనేదే కీలకం. దాని ద్వారానే రాష్ట్ర స్థూల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుంది. మైనింగ్, వ్యవసాయ ఉత్పత్తుల్లో జీవీఏ ప్రధానమైన అంశం. జీఎస్డీపీ వృద్ధి అయితేనే ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందించగలం. వివిధ రంగాల్లో ఉత్తమ ఫలితాలు వచ్చేలా కార్యాచరణ చేయాలి." అని చంద్రబాబు సూచించారు. ప్రస్తుతం ఉద్యాన పంటల ద్వారా రూ.1,26,098 కోట్ల రూపాయల జీవీఏ వచ్చిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఆక్వా అనుబంధ పరిశ్రమ ద్వారా రూ.1.12 లక్షల కోట్ల మేర జీవీఓ జోడించినట్టు అధికారులు వెల్లడించారు.

**రాష్ట్రంలో మెరుగైన జీవన ప్రమాణాలే లక్ష్యం**



ఆర్థికాభివృద్ధితో పాటు రాష్ట్రంలోని ప్రజలకు నాణ్యమైన జీవన ప్రమాణాలు ముఖ్యమని సీఎం స్పష్టం చేశారు. "అత్యధిక తలసరి ఆదాయం కలిగిన రాష్ట్రంగా ఏపీ తయారు కావాలి. బెటర్ సొసైటీ, బెటర్ లివింగ్ స్టాండర్డ్స్ తీసుకువచ్చేలా ప్రభుత్వ శాఖలు పని చేయాలి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రమాణాలు ఎలా నిర్దేశిస్తున్నారో పరిశీలించండి. ప్రతీ రంగంలోనూ ఏపీ ముఖ్య భూమిక పోషించాలి. గ్రామస్థాయి నుంచి కుటుంబం వారీగా పర్యవేక్షణ జరగాలి. లబ్దిదారులకు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్రం ఇచ్చే నిధులకు సంబంధించిన సమాచారాన్ని క్రోడీకరించండి. ప్రతీ కుటుంబం తాలూకు ఆర్థిక, ప్రజారోగ్య వివరాలు నమోదు కావాలి. ఫారెస్టు గ్రీన్ కవర్, ఎయిర్ క్వాలిటీ, తలసరి విద్యుత్ వినియోగం ఇలా అన్ని అంశాలను ఆయా శాఖలు నమోదు చేయాలి. కేవలం ఆదాయం, సంపద సృష్టికి మాత్రమే పరిమితం కావొద్దు." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**ప్రతీ విభాగానికీ ఓ ఇండికేటర్**

"వివిధ రంగాల్లో ఫలితాలను సాధించేందుకు ఏ ప్రమాణాల్ని నిర్దేశించుకున్నారనేది కూడా కీలకం. ప్రస్తుతం అవేర్ ద్వారా 42 అంశాలను కొలుస్తున్నాం... వివిధ ప్రభుత్వ శాఖలు కూడా ఇదే స్థాయిలో ప్రమాణాలు నిర్దేశించుకుని ఇండికేటర్లు ఏర్పాటు చేసుకోవాలి. విద్యుత్, రవాణా, జలవనరులు, పరిశ్రమలు, స్వచ్ఛాంధ్ర ఇలా అన్ని విభాగాలూ ఇండికేటర్లను నిర్దేశించుకోవటం ద్వారా మెరుగైన జీవన ప్రమాణాల్ని సాధించే అవకాశం ఉంటుంది. ఈ ప్రమాణాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎలా ఉందో కూడా ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలి. ఆగస్టు 15 నుంచి ప్రభుత్వం అందించే 700 సేవలు ఆన్ లైన్ లో అందుబాటులో ఉంచాలి. కేవలం 60 లక్షల జనాభా, పరిమితమైన వనరులతో సింగపూర్ దేశం అంతర్జాతీయంగా విజయాలు సాధిస్తోంది. భారత్ లో 140 కోట్లకు పైగా జనాభా, అపారమైన వనరులతో చాలా విజయాలు సాధించే అవకాశం ఉంది. బయటి ప్రపంచం చూడకుండా మనకు మనమే తెలివైన వాళ్లని భావించుకోవడం సరికాదు. ఆర్టీజీఎస్ ద్వారా వచ్చే సమాచారాన్ని క్రోడీకరిస్తే అది అతిపెద్ద సంపద అవుతుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఆ సమాచారాన్ని విశ్లేషించి వినియోగించుకుని ప్రభుత్వ శాఖల సామర్థ్యాన్ని పెంచుకునే అవకాశముంది. అలాగే ప్రతీ త్రైమాసికానికీ సాధిస్తున్న పురోగతిపై ప్రభుత్వ శాఖలు సమీక్షించుకోవాలి." అని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమీక్షలో మంత్రి పయ్యావుల కేశవ్, సీఎస్ కె.విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# సింగపూర్‌లో జగన్ ప్రభుత్వం ఏపీ ప్రతిష్ఠను దెబ్బ తీసింది

**అమరావతి :** సింగపూర్ లో గత జగన్ ప్రభుత్వం ఏపీ ప్రతిష్ఠను దెబ్బ తీసిందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ పేర్కొన్నారు. ఈ ఏడాది చివరకల్లా రాష్ట్రాన్ని లెగసీ వేస్ట్ ఫ్రీ స్టేట్ గా మారుస్తామన్నారు పురపాలక శాఖ మంత్రి నారాయణ...గత ప్రభుత్వం వదిలేసి వెళ్లిపోయిన చెత్తతో పాటు కొత్తగా వచ్చిన 20 లక్షల టన్నుల చెత్తను పూర్తిగా తొలగిస్తామన్నారు. రాష్ట్రంలోని మున్సిపాల్టీల్లో ఘన,ద్రవ వ్యర్థాల నిర్వహణకు కమిషనర్లు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు...స్వచ్ఛ నగరాల సాధన కోసం ప్రజల్లో కల్పించాల్సిన అవగాహనపై స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఐఈఎస్, కెపాసిటీ బిల్డింగ్ పై రాష్ట్ర స్థాయి వర్క్ షాప్ ను మంత్రి నారాయణ ప్రారంభించారు...ఆ తర్వాత మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాల్టీల కమిషనర్లు సాలిడ్ వేస్ట్,లిక్విడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి...చెత్త రహిత నగరాలుగా మార్చేందుకు మున్సిపల్ కమిషనర్లు కీలక పాత్ర వహించాలి...స్వచ్ఛ భారత్ కింద స్వచ్ఛాంధ్ర సాధనకు అధికారులు,ప్రజలంతా కలిసి పనిచేయాలి...ప్రతి నెలా మూడో శనివారం సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటున్నారు...ఏదో ఒక ప్రాంతంలో స్వయంగా పాల్గొంటూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు... స్వచ్ఛాంధ్ర సాధనకు ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు వారి సహకారం కావాలి...కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన స్వచ్ఛతా నాలెడ్జ్ పార్టనర్స్ తో కలిసి మున్సిపల్ కమిషనర్లు చర్చించుకుని వాటిని కింది స్థాయిలో



అమలుచేసేలా చర్యలు చేపట్టాలి....రాష్ట్రంలోని 5 నగరాలకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు రావడం గర్వకారణంగా ఉంది... అవార్డులు సొందిన మున్సిపాల్టీల అధికారులు, సిబ్బందికి మంత్రి నారాయణ అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం 85 లక్షల టన్నుల చెత్తను వదిలేసి వెళ్లిపోయిం దన్నారు మంత్రి నారాయణ. ఈచెత్తనంతా వచ్చే అక్టోబర్ రెండో తేదీ నాటికి పూర్తిగా తొలగిస్తామన్నారు. మరోవైపు కొత్తగా వచ్చిన 20 లక్షల టన్నుల చెత్తను కూడా డిసెంబర్ నాటికి పూర్తిగా తొలగించి లెగసీ వేస్ట్ ఫ్రీ స్టేట్ గా మారుస్తామన్నారు...రాష్ట్రంలోని ప్రతిరోజూ వచ్చే ఘన వ్యర్థాలను వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ లకు తరలిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న విశాఖపట్నం, గుంటూరు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ లతో పాటు కొత్తగా కడప, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతిలో కూడా ప్లాంట్ లు ఏర్పాటుచేస్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఈ ప్లాంట్ లన్నీ అందుబాటులోకి వస్తే రాష్ట్రం డంపింగ్ యార్డ్ రహితంగా మారుతుందన్నారు.అలాగే ద్రవ వ్యర్థాల నిర్వహణ కోసం సీవరేజి ట్రీట్ మెంట్ ప్లాంట్లు రెండేళ్లలో ఏర్పాటుచేస్తామన్నారు. అమృత్ పథకం నిధులతో డ్రింకింగ్ వాటర్ పైప్ లైన్లు పూర్తిచేస్తామని చెప్పారు.

**గత ప్రభుత్వ నిర్వాకంతో సింగపూర్‌కు ఏపీకి మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి.**

2014-19 మధ్య కాలంలో సింగపూర్ లోని మెజారిటీ షేర్ ఉన్న కంపెనీలతో అగ్రిమెంట్ చేసుకున్నామని. గత ప్రభుత్వం ఆ అగ్రిమెంట్ ను రద్దు చేయడంతో పాటు సీఐడీ అధికారులను పంపి విచారణ జరిపించారని అన్నారు. దీంతో ఆ ప్రభుత్వంతో ఏపీకి ఉన్న సంబంధాలు దెబ్బతాన్నాయన్న మంత్రి...తిరిగి ఆ సంబంధాలు పునరుద్దరించడానికే సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనకు వెళ్లారని అన్నారు. సింగపూర్ ప్రభుత్వాధికారులు ఎంతో పాజిటివ్ గా స్పందించారని అన్నారు.సింగపూర్ ప్రభుత్వానికి సీఎం చంద్రబాబు అంటే ఎంతో గౌరవం ఉందన్నారు. అయితే ప్రపంచ బ్యాంకుతో కలిసి అమరావతికి సహకారం అందించేందుకు సింగపూర్ ప్రభుత్వం ముందుకొచ్చిం దన్నారు. అలాగే సింగపూర్ కంపెనీలను విశాఖలో జరిగే భాగస్వామ్య సదస్సుకు రావాలని సీఎం ఆహ్వానించినట్లు తెలిపారు...తర్వాత సింగపూర్ ప్రభుత్వంతో సీఆర్డీఏ కమిషనర్ అధికారికంగా లెటర్ రాసిన తర్వాత సంప్రదింపులు చేస్తారని మంత్రి నారాయణ అన్నారు.

# జూబ్లీహిల్స్ కోసం గులాబీ వ్యూహాలు

-మొదటిపేజీ తరువాయి

దీని తో రాబోయే ఉప ఎన్నికల్లో గెలిచేందుకు ముస్లిం ఓటర్లు కీలకం కావడంతో బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే ఆ ఓట్లపైన దృష్టి సారించింది. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ తరుఫున పోటీ చేసిన అజారుద్దీన్‌కు 1,64,212 ఓట్లు వచ్చాయి. ప్రస్తుతం అధికార కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం పైన దృష్టి పెట్టింది. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ విస్తృతంగా ప్రజల్లోకి వెళ్తున్నారు. సభలు, సమావేశాలను నిర్వహి స్తున్నారు. ఇటు బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారం ప్రణాళికలు రచిస్తోంది. ఎమ్మె ల్సీలు దాసోజు శ్రవణ్ కుమార్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిలు డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యనేతలు, కార్యకర్తలతో సమావేశమవుతున్నారు. గులాబీ పార్టీలోని ముస్లిం నేతలకు ఉప ఎన్నికల్లో కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. మాజీ డిప్యూటీ సీఎం మహమూద్ అలీ కూడా నియోజకవర్గంలోని ముస్లిం నేతలు, కార్యకర్తలతో సమావేశమవుతున్నారు. ము స్లింలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, మంత్రి వర్గంలో ముస్లింలకు ప్రాధాన్యత లేదని ప్రసంగాల్లో నేతలు స్ప ష్టం చేస్తున్నారు.కేసీఆర్ హయాంలో ము స్లింల సంక్షేమం కోసం చేపట్టిన పథకాలను వివరిస్తున్నారు. ఇటు బీజేపీ, కాంగ్రెస్ పార్టీ లు రెండు ఒక్కటేనని బీఆర్ఎస్‌ను ఎదుర్కొనేందుకు రెండు పార్టీలు ప్రయత్నిస్తున్నా యని గులాబీ నేతలు చెప్తున్నారు.నియోజకవర్గంలో పార్టీ తరుఫున అభ్యర్థి ఎంపికపై ఇప్పటికే పార్టీ అధిష్ఠానం ఓ నిర్ణయానికి వచ్చిందని సమాచారం. అభ్యర్థి ఎంపిక, నియోజకవర్గంలో ప్రజాభిప్రాయం సేకరణ కూడా చేపట్టినట్లుగా పార్టీ వర్గాలు చెప్తున్నాయి. మాగంటి కుటుంబీకుల నుంచే ఎన్నికల బరిలోకి దిగే అవకాశాలున్నట్లు కారు పార్టీ వర్గాలు అంటున్నాయి. దివంగత నేత మాగంటి గోపీనాథ్ సతీమణి సునీత మాగంటి పేరు ప్రధానంగా వినిపిస్తోంది.



జూబ్లీహిల్స్ బై ఎలక్షన్‌లో విజయం సాధించడం ద్వారా క్యాడర్‌లో ఉత్సాహం నింపాలని గులాబీ పార్టీ కార్యాచరణ రూపొందించుకుంటోంది. క్షేత్ర స్థాయిలో ఇప్పటికే పార్టీ ముఖ్యులు పర్యటిస్తూ ప్రచారాన్ని ఉధృతం చేస్తున్నారు.ఎన్నికల షెడ్యూల్ విడుదల కంటే ముందుగానే ప్రచార కార్యక్రమాలను డివిజన్ల వారీగా ఏర్పాటు చేసే ప్రణాళికలు కారు పార్టీ నేతలు రచిస్తున్నారు. ఇటు కేటీఆర్, హరీశ్ రావులు బై ఎలక్షన్ బాధ్యతలు తీసుకొని నియోజకవర్గంలో విస్తృతంగా పర్య టించేలా కార్యక్రమాలను రూపొందించే పనిలో కారు పార్టీ ఉన్నది. కేసీఆర్ కూడా నియోజకవర్గంలో ఒకటి, రెండు భారీ సభలు నిర్వహించే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు అంటున్నాయి.తెలంగాణ భవన్‌లో నియోజకవర్గానికి చెందిన ముఖ్య నేతలు, కార్యకర్తల సమావేశాలు వీలైనన్ని ఎక్కువగా నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నట్లుగా పార్టీ నేతలు చెప్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశం కేటీఆర్ పాల్గొన్నారు. రాబోయే ఉప ఎన్నికల్లో విజయం సాధించడం ఎంత ముఖ్య మో ఆయన వివరించారు.

## ఏపీలో ఉచిత బస్సు ప్రయాణంపై మార్గదర్శకాలు జారీ

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆగష్టు 15 వ తేదీ నుంచి రాష్ట్ర మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక సూపర్ సిక్స్ పథకాలు ఒక్కోక్కటి ప్రజలకు చేరువ చేస్తున్నట్లు తెలిపారు. దానిలో భాగంగానే రాష్ట్రంలోని మహిళలకు అందరికి ఫ్రీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పుకొచ్చారు.

**ఈ బస్సుల్లో మాత్రమే..**

ఆగస్టు 15వ తారీఖున ఈ పథకం అమలుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని తెలిపారు. జనవరి నెలలో కర్నాటక, తమిళనాడు, తెలంగాణలో పర్యటించి అక్కడ అమలు జరుగుతున్న ఫ్రీ బస్సు పథకాన్ని పరిశీలించినట్లు మంత్రి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటుకు ముందు మహిళలకు ఎన్నో స్కీములు చెప్పామని, దానిలో ఉచిత బస్సు పథకాన్నికి మహిళలు మొగ్గు చూపారు అన్నారు. రాష్ట్రంలో ఎక్కడి నుండి ఎక్కడికయినా జీరో టికెటింగ్ విధానం అమలు చేస్తున్నట్లు చెప్పారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్ ప్రెస్, అల్ట్రా ఎక్స్ ప్రెస్‌లలో కూడా ఈ పథకం అమలులో ఉటుందని మంత్రి స్పష్టం చేశారు.

## 'లోకేశ్‌కు సీఎం పదవి.. చంద్రబాబు ఇంట్లో గొడవలు'

-మొదటిపేజీ తరువాయి

చంద్రబాబును మించిన అవినీతిపరుడు లోకేశ్. చంద్రబాబు ప్రతీ విషయంలోనూ డ్రామాలు ఆడుతున్నారు. భయంకరమైన కుట్రలకు చంద్రబాబు ఆద్యుడు. ఢిల్లీలో పనిచేసే ఇతర దేశాల విలేకర్లకు నెలవారీ జీతాలు ఇస్తున్నారు. పాకిస్తాన్ జర్నలిస్టులకు కూడా చంద్రబాబు డబ్బులు పంపుతున్నారు. పదే పదే 90 దేశాలు అంటూ చంద్రబాబు మాట్లాడే మాటల వెనుక చాలా కథ ఉంది.

**అందుకే రామోజీకి భూమి..**

చంద్రబాబు మోసాలను సింగపూర్ ప్రభుత్వం గ్రహించిందిఅందుకే ఆయన్ను సింగపూర్ ప్రభుత్వం దూరం పెట్టింది. కుట్రలు పన్నటంలో చంద్రబాబును లోకేశ్ మించి పోయాడు. ఇప్పుడు లోకేశ్ భజన చేయటంలో ఎల్లో మీడియా పోటీ పడుతోంది. పత్రికలను అడ్డం పెట్టుకుని ఎన్టీఆర్ మనుషులను పార్టీకి దూరం చేశారు. తనకు ఇష్టమైన వారిని దగ్గర చేర్చుకుని, ఎన్టీఆర్ టీమ్‌ని వెళ్లగొట్టారు. తాను అడిగిన వందలాది ఎకరాల భూమిని రామోజీరావుకు ఎన్టీఆర్ ఇవ్వలేదు. ఆ కోపంతో ఉన్న రామోజీరావుని చంద్రబాబు దగ్గరకు చేర్చుకున్నారు. ఆ తర్వాత నుండి చంద్రబాబు తన కుట్రలకు మరింత పదును పెట్టారు.

**అన్నింటా బాబు మనుషులే..**

ఎన్టీఆర్ గెలుపు వెనుక నేను ఉన్నానని నాపై కుట్రలు పన్నారు. నన్ను రాజ్యాంగేతర శక్తి అంటూ నాపై ఆరోపణలు చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని బిల్‌గేట్స్‌ని మించిన ధనవంతుడ్ని కావాలని చంద్రబాబుకు కోరిక ఉండేది. అందుకే విపరీతమైన అవినీతి, అక్రమాలు, కుట్రలు చేస్తూ వస్తున్నారు. పరిపాలన చేతగాని చంద్రబాబు వ్యవస్థలను మేనేజ్ చేసుకుంటూ బతుకుతున్నారు. తండ్రిని మించిన అవినీతిలో లోకేశ్ మునిగి పోయారు. ఇసుక, మద్యంలో తండ్రీ కొడుకుల అవినీతి తారాస్థాయికి చేరింది. ఇక్కడ సంపాదించిన డబ్బంతా సింగపూర్‌లో పెట్టుబడి పెడుతున్నారు. సీబీఐ, ఈడీ సహా అనేక న్యాయ వ్యవస్థల్లో చంద్రబాబు మనుషులు ఉన్నారు. తాము దోచుకున్న డబ్బుతో వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారు. ఈ అవినీతి ప్రభుత్వం ఎంతోకాలం నిలవదు' అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

## మందు బాబులకు గుడ్ న్యూస్

**అమరావతి :** రాష్ట్రంలో మద్యం పాలసీ గడువు మరి కొద్ది రోజుల్లో ముగియనుంది. ఈ నేపథ్యంలో కొత్త మద్యం విధానాన్ని అమలు చేయాలని చంద్రబాబు సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా కొత్త మద్యం విధానాన్ని సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంత్రి వర్గ ఉప సంఘం నివేదిక ఆధారంగా ఈ కొత్త మద్యం విధానాన్ని అమలు చేయనుంది. మద్యం పాలసీ అంటే ఆదాయం కాదు.. ప్రజల ఆరోగ్యం ముఖ్యమనే విధంగా ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తుంది. దీంతో అల్కాహాల్ కంటెంట్ తక్కువ ఉండే మద్యం విక్రయాలతో నష్టం తగ్గించ వచ్చునని భావిస్తుంది. అంటే.. మద్యం కారణంగా పేదల ఇళ్లు, ఒళ్లు గుల్లా కాకుండా చూడాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ క్రమంలో బార్లలో కూడా గీత కార్మిక వర్గాలకు 10 శాతం షాపులు కేటాయించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు.

**ప్రభుత్వ వైద్యులకు రిజర్వేషన్లు..**

ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. పీజీ వైద్య విద్య ప్రవేశాల్లో ప్రభుత్వ వైద్యులకు రిజర్వేషన్లను ఖరారు చేశారు. 7 క్లినికల్ సబ్జెక్టుల్లో 15 శాతం, నాన్ క్లినికల్ సబ్జెక్టుల్లో 30 శాతం రిజర్వేషన్ వారికి కల్పించాలని నిర్ణయించారు. అయితే స్పెషలిస్టుల అవసరాలతోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల ఆకాంక్షల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ రిజర్వేషన్లు కల్పించాలంటూ వైద్యారోగ్య శాఖ ప్రతిపాదనపై సీఎం చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారు.

## విశాఖకు మరో ఐదు ఐటీ కంపెనీలు



-మొదటిపేజీ తరువాయి

భూములు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖపట్నంలో ఈ ఐదు కంపెనీలు కలిపి రూ.19,223 కోట్లు పెట్టుబడులు పెట్టనుండగా.. సుమారుగా 50 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కలగనున్నట్లు అధికారులు చెప్తున్నారు.సిఫీ ఇన్ఫినిటీ స్పేషెస్ లిమిటెడ్ అనే సంస్థ విశాఖపట్నంలో డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. రూ.15,226 కోట్లతో ఈ డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. ఈ నేపథ్యంలో పరదేశీపాలెంలో సిఫీ సంస్థకు ఎకరా 50 లక్షల రూపాయల చొప్పున 25 ఎకరాలు కేటాయించారు. అలాగే మధురవాడ ఐటీ సెజ్‌లో ఎకరా కోటి రూపాయల చొప్పున 3.6 ఎకరాలు కేటాయించారు. ఈ పెట్టుబడుల ద్వారా 600 మందికి ఉపాధి దక్కనుంది. ఇక సత్వ డెవలపర్స్ అనే సంస్థ విశాఖలో రూ.1500 కోట్లు పెట్టుబడులు పెట్టనుంది. ఈ నేపథ్యంలో మధురవాడలో ఎకరా కోటిన్నర చొప్పున 30 ఎకరాలు కేటాయించారు. సత్వ పెట్టుబడులతో సుమారుగా 25 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ వేయి కోట్లు పెట్టుబడి పెట్టనుంది. ఈ నేపథ్యంలో విశాఖపట్నం ఐటీ సెజ్‌లో ఎకరా 99 పైసల చొప్పున 10.29 ఎకరాల భూమిని కేటాయించారు. ఈ పెట్టుబడులతో పదివేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.పేనమ్ పీపుల్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు మధురవాడలోని హిల్-2లో 45 సెంట్లు, రుషికొండ ఐటీ పార్క్‌లో 4 ఎకరాలు మొత్తంగా ఎకరా రూ.4.05 కోట్లతో 4.45 ఎకరాలు కేటాయించారు.పేనమ్ పీపుల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.207.5 కోట్ల పెట్టుబడి పెడుతోంది. దీనిద్వారా 2,500 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఇక బీవీఎం ఎనర్జీ అండ్ రెసిడెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ఎండాడ వద్ద ఎకరా రూ.1.5 కోట్ల ధరతో 10 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. బీవీఎం ఎనర్జీ సంస్థ రూ.1,250 కోట్ల పెట్టుబడితో 15000 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనుంది.

## మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డికి ఘన నివాళి



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగష్టు 04:** మాజీసర్పంచ్ గోపాల్‌రెడ్డికి వైకాపా ఆధ్వర్యంలో ఘననివాళులు అర్పించారు. ఈసందర్భంగా మండల వైకాపా అధ్యక్షుడు నాగభూషణ్ రెడ్డి ప్రసంగిస్తూ గోపాల్‌రెడ్డి సర్పంచ్ గాచింతమాకుల పల్లి, గ్రామపంచాయతీకి అనేక సేవలు చేశారని గుర్తు చేశారు. ఆయనమరణం పంచాయతీ ప్రజల తో పాటుపార్టీకి తీరనిలోటు అని అన్నారు. అనంతరం గోపాల్ రెడ్డి మృత దేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ మండల ఉపాధ్యక్షుడు నరసింహులు యాదవ్ సాదిక్ భాషా వైకాపా మండల ఉపాధ్యక్షుడు జంగాలపల్లి రమణ శంకర తదితరులు పాల్గొన్నారు.

## మండల సమస్యలపై వెంటనే స్పందించాలి

### గువ్వల రమేష్ రెడ్డి



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగష్టు 04:** మండల సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి కోరారు. సోమవారం స్థానిక మండల పరిపాలన భవనంలోని ఎంపీడీవో తహసిల్దార్ ఈజీఎస్ కార్యాలయాలను ఆయన సందర్శించి అధికారులతో మండల సమస్యలపై సమీక్షించారు రానున్నది వర్షాకాలమని అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు సమస్యలతో కార్యాలయాలకు వస్తే వారి సమస్యల పరిష్కారం వైపు మొగ్గుచూపాలన్నారు. అనంతరం ఆయా అధికారుల పనితీరును సమీక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీధర్ రాజు బోయకొండ సుబ్బు సోము పవన్ కుమార్ అర్జున్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

### మంత్రి సత్య కుమార్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఘన సన్మానం

**ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 04:**



రాష్ట్ర ఆరోగ్యశాఖమంత్రి సత్య కుమార్ యాదవ్‌ను ప్రభుత్వవిప్ జీడీ నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌ను ప్రకృతి షెల్టర్ చైర్మన్ పాలసముద్రం టిడిపి యువ నాయకుడు తాళ్లూరి శివ ఘనంగా సన్మానించి సత్కరించారు. పాలసముద్రం మండలం విలేజ్ క్లినిక్‌ను రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రభుత్వవిప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ప్రారంభించారు అలాగే కోకోకోలా కంపెనీ ప్రతినిధులు సేవాభావంతో పాలస ముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆపరేషన్ థియేటర్ టేబుల్ ఏర్ కండిషన్ వంటి విలువైన వస్తువులను విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి షెల్టర్ చైర్మన్ పాలస ముద్రం టిడిపి యువనాయకుడు తాళ్లూరి శివ, విక్రం, శేఖర్ రాజు, ఆరుల్,రోషు నాయుడు, మణి నాయుడు, నవీన్, భాస్కర్ నాయుడు, సాంబశివ, రామపురం పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

# తగ్గేదేలే అంటున్న బంగారం ధరలు



బంగారం, వెండి ధరలు చాలా కాలంగా ఎక్కువగానే ఉన్నాయి. అమెరికాలో డాలర్ బలం కారణంగా కొంత ఒత్తిడి ఉంది. కానీ ట్రంప్ వాణిజ్య యుద్ధ విధానం కారణంగా, పెట్టుబడిదారులు ఇప్పటికీ బంగారం, వెండిని 'సురక్షిత పెట్టుబడి'గా గమనిస్తున్నారు. అమెరికా విధించిన సుంకాల ప్రభావం ఇప్పుడు బంగారు అభరణాల మార్కెట్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. బంగారం ధరలు అకస్మాత్తుగా పెరగడం జరుగుతుంది. ఒక రోజు తగ్గితే మరో రోజు పెరుగుతుంటుంది. ప్రస్తుతం బంగారం ధరలు స్వల్పంగా తగ్గినప్పటికీ తులం ధర లక్ష రూపాయలకుపైగానే ఉంది. దీంతో సామాన్యుడు కొనలేని పరిస్థితి ఏర్పడింది. ఇక వెండి ధర కూడా అందే అది కూడా అందనంత ఎత్తుకు దూసుకుపోతోంది. +టూ జోడించకుండానే బంగారం రూ. లక్ష దాటింది. రాబోయే రోజుల్లో బంగారం ధరలు ప్రజలను ఆశ్చర్యపరుస్తాయని, వెండి మరింత చౌకగా మారవచ్చని కొందరు అంటున్నప్పటికీ అదేమి తగ్గకుండా లక్షకుపైగానే దూసుకుపోతోంది. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,01340 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ. 92,890 వద్ద ఉంది.ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,01490 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ. 93,040 వద్ద ఉంది.ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,01340 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ. 92,890 వద్ద ఉంది.హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,01340 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ. 92,890 ఉంది.విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,01340 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ. 92,890 ఉంది.బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,01340 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ. 92,890 వద్ద ఉంది.ఇక వెండి ధర విషయానికొస్తే కిలో వెండి ధర 1 లక్ష 12,900 రూపాయలు ఉంది.బంగారం, వెండి ధరలు చాలా కాలంగా ఎక్కువగానే ఉన్నాయి. అమెరికాలో డాలర్ బలం కారణంగా కొంత ఒత్తిడి ఉంది. కానీ ట్రంప్ వాణిజ్య యుద్ధ విధానం కారణంగా, పెట్టుబడిదారులు ఇప్పటికీ బంగారం, వెండిని 'సురక్షిత పెట్టుబడి'గా గమనిస్తున్నారు. గత 20 ఏళ్లలో బంగారం ధరలు విపరీతంగా పెరిగాయి. 2005లో 10 గ్రాములకు రూ. 7,638 ఉన్న బంగారం, ఆగస్ట్ 4, 2025 నాటికి రూ.1 లక్ష దాటింది . వెండి కూడా కిలోకు రూ. 1 లక్ష కంటే ఎక్కువగానే ఉంది. అంటే, దీర్ఘకాలికంగా, ఈ రెండు లోహాలు పెట్టుబడిదారులకు గొప్ప రాబడిని ఇచ్చాయి.

# ట్రంప్ వచ్చాక యూఎస్ నుంచి భారీగా పెరిగిన చమురు కొనుగోళ్లు!




యూఎస్ నుంచి చమురు దిగుమతులను భారత్ భారీగా పెంచింది. ముఖ్యంగా డొనాల్డ్ ట్రంప్ ఆ దేశాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ పెరుగుదల కనిపిస్తోందని గణాంకాలు చెప్తున్నాయి.గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు యూఎస్ నుంచి ముడిచమురు దిగుమతులు 51 శాతం పెరిగాయి. మరీ ముఖ్యంగా ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో యూఎస్ నుంచి ముడిచమురు దిగుమతులు ఏకంగా 114 శాతం పెరిగినట్లు సమాచారం.ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 1.73 బిలియన్ డాలర్ల విలువైన చమురు దిగుమతి చేసుకున్న భారత్.. ఆ తర్వాతి త్రైమాసికంలో 3.7 బిలియన్ డాలర్ల విలువైన చమురును కొనుగోలు చేసింది. ఈ ఏడాది జూన్‌తో పోలిస్తే జులై నెలలో యూఎస్ నుంచి చమురు కొనుగోళ్లు 23 శాతం పెరిగాయని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. గతంలో భారత చమురు కొనుగోళ్లలో యూఎస్ వాటా కేవలం 3 శాతమే ఉండేది. ఇది జులై నెలలో 8 శాతానికి పెరిగింది.ఇక 2025-2026 ఆర్థిక సంవత్సరంలో భారత చమురు దిగుమతులు కనీసం 150 శాతం పెరుగుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. యూఎస్ నుంచి భారత్ చేసుకునే సహజ వాయువు దిగుమతుల్లో కూడా భారీగా పెరుగుదల కనిపించినట్లు తెలుస్తోంది. గతేడాది 1.41 బిలియన్ డాలర్ల విలువైన సహజ వాయువు కొనుగోలు చేసుకున్న భారత్.. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో ఇది 2.46 బిలియన్ డాలర్లకు చేరింది. ఇది ఆరంభం మాత్రమేనని, సహజ వాయువు దిగుమతుల విషయంలో త్వరలోనే యూఎస్-భారత్ మధ్య కీలకమైన కాంట్రాక్ట్ జరుగుతుందని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. ఈ ఒప్పందం జరిగితే ఈ దిగుమతులు మరింత పెరిగే అవకాశం ఉంది.

## కుప్పం ప్రభుత్వ కళాశాలలో మహిళల భద్రత కోసం పోష్ యాక్ట్ పై అవగాహన కార్యక్రమం







**కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్ట్ 4:** స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల కుప్పంలో మహిళా సాధికార సమన్వయకర్త డాక్టర్ సి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో మహిళల భద్రత కోసం 2013లో ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా తీసుకువచ్చిన పోష్ యాక్ట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రధానాచార్యులు డా కెవి చిదంబరం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ మహిళలు, విద్యార్థి నులు ఉద్యోగం చేసే చోట, చదువుకునే చోట ఎలాంటిలైంగిక వేధింపులకు గురైన కళాశాల మహిళా సాధికార సమన్వయ కమిటీకి వెంటనే తెలియజేసి రక్షణ పొందవచ్చునని హితవు పలికారు. అలాగే మహిళా సాధికార సమన్వయకర్త డా.సి. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రకృతిలో ప్రతి వస్తువు అందంగా కనిపించినట్టే మనకు కంటికి కనిపించేవన్నీ మన మానసిక ఆరోగ్యానికి మంచివి కావని, డిగ్రీస్థాయి విద్యార్థినీ విద్యార్థులు ఏది మంచి, ఏది చెడు అని తెలుసుకొని జ్ఞానాన్ని పొంది ముందుకు సాగాలని, పనిచేసే ప్రదేశంలో మహిళలకు భద్రత ఉండటం అనేది చాలా ముఖ్యం. అయితే చాలా మంది స్త్రీలు భయంతో కొన్ని విషయాల్లో వెనకడుగు వేస్తారు. కానీ వారికి ఆయుధంలా పనిచేసే కొన్ని చట్టాలో పోష్ యాక్ట్ ఒకటి ఉందని తెలుపుతూ విద్యార్థులు, మహిళలు Sexual Harassment పై అవగాహన కలిగి ఉండి మీ పరిసర ప్రాంతాల్లోని మహిళలకు తెలియజేసి తమను తాను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వి.నారాయణ మూర్తి, డా కుంచె మాధవి, ఐక్యు ఏసి కో ఆర్డినేటర్ ఎల్.బి.ప్రదీప్ కుమార్ తదితరఅధ్యాపక, అధ్యాపకేతరులు విద్యార్థిని విద్యార్థులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ క్రీడా పోటీలలో విజయం సాధించిన పీలేరు జట్టు



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు 04:** అన్నమయ్యజిల్లా పీలేరు ఆంధ్రప్రదేశ్ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటిఎఫ్) ఆధ్వర్యంలో పీలేరు ప్రభుత్వజూనియర్ కళాశాల నందు జరిగినటువంటి క్రికెట్ పోటీలలో పీలేరు జట్టు విజయం సాధించి మొదటి బహుమతి గెలుచుకోవడం జరిగింది. రాజంపేట జట్టు ద్వితీయ బహుమతి గెలుపొందడం జరిగింది. ప్రతి సంవత్సరం కూడా క్రమంతప్పకుండా ఉపాధ్యాయ క్రీడా పోటీలు ఒక్కొక్కసారి ఒక్కొక్క ప్రాంతంలో నిర్వహిస్తామని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లాగౌరవాధ్యక్షులు సుధాకర్ నాయుడు, ట్రెజరర్ బి.చంద్రశేఖర్ జిల్లాకార్యదర్శిలు అక్రమభాష, రమణమూర్తి, జిల్లా క్రీడా విభాగపు కన్వీనర్ సుధాకర్ వ్యాయామ సీనియర్ ఉపాధ్యాయులు నరసరాజు వివిధ మండలాల నాయకులు పీరయ్య, వెంకటరమణ, విజయ్ కుమార్, రాజు,ఆదర్శ పాఠశాలల రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్, వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక PGRS

**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్,ఆగస్ట్04:**



ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరిం చేందుకు కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కడ) ఆధ్వర్యంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించబడింది. ఈ సమావేశానికి కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఐఏఎస్ నేతృత్వం వహించారు. వివిధ శాఖలమండల, డివిజనల్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పింఛన్లు, భూమిసమస్యలు, ఉద్యోగ సమస్యలు, ఆరోగ్య సమస్యలు తదితర ప్రజలనుండి అభ్యర్థనలు స్వీకరించబడ్డాయి. సమస్యలను వినతి పత్రాల రూపంలో తీసుకుని సంబంధిత శాఖలకు పంపించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ PGRS కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అనేక సమస్యలు స్వీకరించుచు న్నామని సాధ్యమైన వాటిని వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి స్వీకరించిన అర్జీలలో పెండింగ్లో ఉన్న అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేకదిష్టి సారించాలన్నారు. ప్రతి అర్జీని నిర్ణీత గడువు లోపల పరిష్కరించాల్సి ఉంటుందని కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఐఏఎస్ తెలియజేశారు.

## ద్రావిడ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో

### రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారకరామారావు విగ్రహావిష్కరణ

గుడిపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 04:




కుప్పంనియోజకవర్గం గుడిపల్లి మండలంలోని ద్రావిడ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారకరామారావు క్లాస్ రూమ్ కాంప్లెక్స్ నందు మంగళవారం రోజు విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ జరిగింది. రాజమండ్రిలో ప్రత్యేకంగా తయారు చేయించిన నందమూరి తారక రామారావు విగ్రహాన్ని మంగళవారం రోజు ద్రావిడ విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య ఎం. దొరస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్రావిడ భాషా సంస్కృతుల పట్ల నందమూరి తారక రామారావుకి ఉన్న విశేషమైన అనురాగం వల్లనే ఆయన ఈ విశ్వవిద్యాలయ స్థాపనకు శ్రీకారంచుట్టారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కిరణ్ కుమార్, డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య కే. శ్యామల, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య విజయవర్ధిని, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరికృష్ణ, యూనివర్సిటీ ఇంజనీర్ ఎంసి.రఘుపతి, ఆచార్యులు, ఉద్యోగస్తులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## పరిశ్రమల ఏర్పాటుకు స్థలాన్ని రూట్ మ్యాప్‌ను పరిశీలన

### జోనల్ మేనేజర్ సుబ్బారావు

**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు04:**



ఎస్ఆర్‌పురం మండలంలో పరిశ్రమల నిర్మాణానికిస్థలాన్ని రూట్ మ్యాప్‌ను ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చరల్ కార్పొరేషన్ జోనల్ మేనేజర్ సుబ్బారావు పరిశీలించారు సోమవారం.ఎస్ఆర్ పురం మండలం పరిశ్రమల నిర్మాణానికి సంబంధించిన ప్రదేశాన్ని రూట్ మ్యాప్‌ను ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్ర క్చర్ కార్పొరేషన్ జోనల్ మేనేజర్ సుబ్బా రావు. ప్రతి రూటును క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే చిత్తూరు తర్చూరుజాతీయ రహదారి లోసర్వీస్ రోడ్డు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ పురం తాసిల్దార్ లోకనాథ్ పిళ్లై సర్వేర్ సురేష్ మాజీ మండల అధ్యక్షుడు భాస్కర్ నాయుడు, బాలాజీ నాయుడు, గొల్లపల్లి సుబ్రహ్మణ్యం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143